

# పేగుముడి

కె. దేవయాని (పెద్దింటి అశోక్‌కుమార్)

ముసిముసి మబ్బుల డప్పు చప్పుడు. ఆ చప్పుడు గుండెలో ఏగినట్టయింది. రాంరెడ్డికి మనసంతా కలవరమయింది. గజిబిజి ఆలోచనలు. జెట్టనలేచి కూసున్నడు. మసుక చీకట్లోకి కండ్లు దులుపరిచ్చుకుని చూశాడు.

బఱ్ఱెపాకలో కొడుకు పాలు పిండుతున్నాడు. కోడలు వాకిట్లో సానుపు సల్లుతుంది. సానుపుచల్లే చప్పుడు పాల చప్పుడుతో కలగలసి గాలివాన చప్పుడును గుర్తుకు తెస్తుంది. మరోసారి దూరాన డప్పు చప్పుడు వినిపించింది. ఏదో చాటింపు వేస్తున్నారు.

'వీళ్లు అన్నంత పనీ చేసినట్టున్నరు,' అనుకుంటూ లేచి నిలబడ్డాడు రాంరెడ్డి. ఊడిపోయిన గోచీని ఎగజెక్కకుంటూ అడుగు ముందుకు వేశాడు. పాణం సొలుగుతుంది. గోడవారగా ఉన్న చేతికఱ్ఱను అందుకుని వాకిట్లోకి వచ్చాడు. మామను చూసి సానుపు చల్లడం ఆపింది కోడలు.

"పద్మా!... ఏంటిదే...? ఏదో చాటింపు జేసిరి," పెండనీళ్లను తొక్కుతూ వాకిలి మోరీని దాటి అడిగాడు రాంరెడ్డి.

రెండు మూడు రోజుల నుండి రగులుతున్న ఇసుక పంచాది పద్మకు తెలుసు. అందులో మామను కలుగజోసుకోవద్దని చెప్పాలని భర్తతో హోరుపడుతనే ఉంది. అందుకే విసురుగా చెప్పింది.

"ఇసుక వేలం పెడుతరరట. కచీరు కాడ పాట నట," తన కోపాన్ని సానుపు నీళ్లమీద చూపింది. అంత వరకు అవునో కాదో అనుకున్న రాంరెడ్డికి నిజం తెలిశాక పిడికిల్లు బిగుసుకున్నాయి. వెన్నులో మొదలైన వణుకు శరీరాన్ని పాకింది. జడతిచ్చినట్టు తలను విదిలించి అడుగు ముందుకు వెయ్యబోతూ కొడుకు పిలుపు విని ఆగిపోయాడు.

కరుత్తునా పొడుత్తునా అన్నట్టు కోపంగా పాల సర్వతో నిలబడ్డాడు బాపురెడ్డి.

"నాయినా... నువ్వు ఇయ్యల్ల బజారుకు పోవద్దు. అసలు ఇంట్ల నుండే కదులద్దు. నువ్వు అన్నీ ఎనుకటి లెక్కపోతవు. అందరొకటంటే నువ్వొకటంటవు. ఊర్లె ఏం జరుగుతె నీకేంది. నువ్వుగిట్ల బజారుకు పోతే నామీద ఒట్టే," విసురుగా లోపలికి నడిచాడు. తండ్రిని ఎన్నడూ ఎదిరించి ఎరుగడు. మాటల్ని కూడ బలుక్కున్నట్టుగా అన్నాడు.

'నీకు గట్టిగ చెప్పరాదు, నన్ను చెప్పనియ్యవు,' అన్నట్టుగా భర్తను, మామను మార్చిమార్చి చూసి తన పనిలో మునిగిపోయింది పద్మ. ఆమె కోపం తీవ్రతను విసురుగా చేస్తున్న పనే చెబుతుంది.

వెనక్కి తిరిగి కొద్దిసేపు కోపంగా కొడుకును నిలువూత చూసాడు రాంరెడ్డి. మనసు మరింత కలవరమైంది. "నువ్వు గూడా నాకు చెప్పే మొనగానివైనవా...? బజారుకుపోయి ఏం పంచాది తెచ్చిన... నువ్వేం తీర్పు జేసుకచ్చినవు. నీకేమైతందిరా నేను బజారుకుపోతే. రండమొకపోడా..." అక్కడి నుండి కదలకుండానే ఊతకఱ్ఱను మోరీ అంచుకు పొడుస్తూ అన్నాడు ఆవేశంగా.

"పద్మా మామనిటు రమ్మనే..." ఇంట్లోంచి భార్య మాటలు గట్టిగా వినిపించాయి. పద్మకు చెబుతున్నట్టుగా కాక తననే పిలుస్తున్నట్టుగా ఉన్నాయి. మామవైపు ఒకసారి తిరిగి చూసి బకీటును పట్టుకుని కుచ్చిళ్లను సదురుకుంటూ విసురుగా లోపలికి వెళ్లింది పద్మ.

అహం దెబ్బతిన్నట్టుగా చూశాడు రాంరెడ్డి. వడి వడిగా అడుగులు వేస్తూ లోపలికి వచ్చాడు. కుడికాలి బొటనవేలికి కడుప తగిలి బొక్కబోర్ల పడబోయి షేరేడును పట్టుకుని నిలదొక్కుకున్నాడు. నడకవేగం తగ్గినా ఆవేశం తగ్గలేదు.

''ఏంటిదే లావు లావు పిలుత్తున్నరు. ఏంటి దంట సంగతి. నాతోని డిల్లేకి జేత్తుండ్రా,'' గచ్చులకచ్చి మొగురాన్ని పట్టుకుని భార్యవైపు చూస్తూ అన్నాడు.

''డిల్లేకి జేసేది నువ్వా మేమా...? ఇడిపాయె పడి పాయెనన్నట్టు లెవ్వంగనే ఉరుకుతున్నవు. నువ్వు రావాలె, రానిది నడువదని పల్లకీలు పంపిండ్రా ఏంది? చిన్నముండకు పెద్ద సోకమట. పెద్దమనిషివని గద్దెమీద కూసుండవెడితే అద్దమడుము పసుపు ఒక్కనివే రాసు కుంటివి. కుండలుండనియ్యడట. కుక్కకెయ్యడట. ఇంటి ముందట టాక్టరుంది. ఏ గిరాకి లేక వట్టిగనే ఉంది. ఉసికె జారగొట్టుడుకు మన టాక్టరునే తీసు కుంటరట తియ్యి. నువు అక్కడికి ఒయ్యి అడ్డుపుల్ల ఏత్తే అయ్యేదేం వచ్చే గిరాకీ పోతది,'' పక్కబట్టలు దులుపుతూ అన్నది లస్మవ్వ.

కొంతసేపు అలాగే నిలవడ్డడు రాంరెడ్డి. కోపం కంటే ఎక్కువగా బాధ కలిగింది. కుడిది కుండ పట్టు కుని ముందునుండే బర్రెపాకలోకి పోయాడు బాపురెడ్డి. అతడు కోపాన్ని అడుగుల మీద సూపిచ్చిండు. పాకలోకి పోయి కుడిది తాగని బర్రెను, ''నీగత్తర్రాను తాగు. నువ్వొకదానివి నా గండాన మోపయినవు,'' అరుస్తు న్నట్టుగా అన్నడు. ''బర్రె పాడుగాను. ఉండి జమలేదు. లేని జమలేదు. పట్టపగలు కటికోనికి అమ్మాలె,'' ముగ్గు వేస్తూ అంటోంది కోడలు గట్టిగానే.

రాంరెడ్డి కాళ్లల్లో సత్తువ సచ్చిపోయింది. విసురు గా బయటకు వెళ్దామనుకుని అడుగేశాడు. పతుకు లాడినట్టుగా పడింది అడుగు. నిన్నటి పంచాదితోనే సగం పాణం సచ్చింది. ఇయ్యాల్లటి ఎచ్చరికలు అతడిని ఆపలేవేమో కానీ అశక్తున్ని చేసినయి.

''మీరంతా బదులుకున్నరే... వాల్లకు సైడిచ్చిందే నువ్వు. గద్దిరిచ్చి మాట్లాడితే ఉచ్చ పోసుకునేటోడు ఇయ్యాల్ల నా మీదికి మర్రవడుతడా...?'' భార్యవైపు చూసి అంటూ అసహనంగా అరుగు అంచున్నే ఊల బడ్డాడు రాంరెడ్డి.

ఎవరూ మాట్లాడలేదు. బయటకు వెళ్తాడేమో అడ్డం తిరిగి ఆపుదామనుకున్న కొడుకు రోషంగా తండ్రి వైపు చూసి కుడిది కుండతో ఇంట్లోకి నడిచాడు.

''వాగుల ఉసికె వేలం పెడితే ఎంత నష్టమో మీకు తెలువది. ఊరు బొగ్గునాలబోడయితది. తాగుదా మంటే నీళ్లు దొరకక కుక్కసావు సత్తరు. చెరువుల చెంబెడు నీళ్లు దొరుకయి. వాడెవడో ఊరికింత ఇసం బోత్తామంటే మీరు చెయ్యిగలుపుతార్రా కుక్కల కొడుకా... అట్ల సంపే బదులు నీళ్ల టాంకీల ఇంత ఎండ్రీన్ కలుపుపోండ్రి ఊరంత సచ్చిపోతరు. తలాపు లకు మీరు కూసుండి తాగితందనాలాడచ్చు,'' పండ్లు కొరుకుతూ అన్నాడు రాంరెడ్డి కొడుకును చూస్తూ.

బాపురెడ్డి కూడా పండ్లు కొరికిండు. ఏదో అన బోతూ తల్లివైపు చూసిండు. లస్మవ్వకు నిన్నటిరోజు మొఖంమీద గొట్టినట్టు ఇరుగు పొరుగోళ్లు అన్న మాటలు యాదికచ్చినయి. వదినె వరుసున్న పోచవ్వ నైతే బొచ్చెల మెరిసేటట్టు, ''ఈ రామన్నకేం పనిలేదా! ఊరు మీదికి ఇరువై వెయిలు ఇచ్చి ఉసికె కొండబోత నంటే వద్దంటుండట. ఏదైనా గిట్లనే జేత్తడట. అందరు ఒకటంటే రామన్న ఒకటంటడట. నిన్న మనిషికొక మాట తిట్టిండ్రుట,'' అన్నది. అవి ఇప్పుడు మరోసారి యాదికచ్చి గయ్యిమంది లస్మవ్వ.

''ఊరిని ఉద్దరిచ్చేతందుకు పుట్టుకచ్చిండే శ్రీరాములుసామి. వాళ్లు వాగులపోతరట. ఈ పెద్ద మనిషి గడ్డకు దెత్తడట. ఆయిటి మూనితే పాపం... చాపలు అందరూ పట్టుకోవాలంటడు. సలికాలం రాను పాపం అందరికీ చిప్పల పండ్లంటడు. ఇంట్లకెల్లి పెట్టుడే గని ఇంట్లకు తెచ్చుట లేదు. ఊరుతోని నీకేం పట్టి. వాళ్లు ఏం చేసుకుంటి నీకేంది? దవాఖానాలకు పోయి కండ్లద్దాలు తెచ్చుకుంటనంటివి గదా! పొయ్యి తెచ్చుకో,'' అన్నది.

అప్పుడే ఇంట్లోకి అడుగుపెట్టాడు కొజ్జె నర్సయ్య. మనిషి పొడుగుంటాడు. అందుకే కొజ్జె నర్సయ్య అంటరు. రాంరెడ్డి ఈడువాడే. పంచకమిటీ మెంబరు. రాంరెడ్డి కంటే పెద్దవాడిలా కనిపిస్తాడు. కట్టి చేతికచ్చి ఏండ్లు దాటినయి. ఇద్దరు కొడుకులు వాగుకు కరెంటు మోటార్లు పెట్టి పంటలు పండిస్తున్నారు.

''ఆయినకేందంటవు లస్మక్కా... అయిన అబి రుద్ది కమిటికి పెసిరెంటు... అయిన గాకపోతే ఎవలం టరు మరి...'' అన్నాడు రాంరెడ్డి పక్కకు వస్తూ.

''అయిపోయింది... నిన్ననే అబిరుద్ది పోయింది. కమిటీ పోయింది. కొత్త ప్రెసిడెంట్‌ను ఎన్నుకున్నరు. అన్నిట్లో అడ్డు తగులుతున్నరని మీ ఇద్దరినీ గ్రామాభి వృద్ధి కమిటీనుండి తీసిపారేసిండ్రు,'' ఎప్పుడు అందునా అని తొందరపడుతున్నట్టుగా వెక్కిరిస్తూ అంటూ తండ్రి

మొహం చూడడానికి భయమేసి ఇంట్లోకి పోయాడు బాపురెడ్డి.

రాంరెడ్డి కళ్లు బైర్లుకమ్మాయి. ఆవేశంగా లెవ్వ బోతూ అలాగే కూలబడ్డాడు. కాయకష్టం చేసి దృఢంగా ఉన్న శరీరం. అరవైఏండ్లు దాటినా అలుపెరగని మనిషి. నిండు నూరేండ్లు నిండి పండు ముసలివాడై పోయినట్టు అచేతనంగా ఉండిపోయాడు. తలలో తిరిగినట్టయింది. కండ్లు జువ్వుమన్నాయి.

''ఊరితో నాకేంటిదా... కొనుక్కచ్చిన కోడలు దానివి నీకేమెరుక! ఈ ఊరు నాది... వాగు నాది... చెరువు నాది... ఈ గాలి భూమి మన్నుమశాడం... అంతా నాది...'' పిచ్చివాడిలా అరుస్తున్నడు రాంరెడ్డి. అతడిని సముదాయించి లేపి కచీరువైపు నడిచాడు నర్సయ్య.

*

ఆ ఊరి పేరు రాంరెడ్డిపల్లె. పేరుకు పల్లెనేగని ఐదువేల జనాభాతో మేజర్ పంచాయితి. మండల కేంద్రానికి ఇరువై కిలోమీటర్ల దూరంలో విసిరేసినట్టుగా అడవిలో ఉన్నది. ఊరు చుట్టూ గుట్టలు. గుట్టలను ఆనుకుని ఊరుకిందుగా పారే వాగు అంచులను తాకుతూ అడివిని తిరిగి మానేరులో కలుస్తది.

రాంరెడ్డి తాత తాతకు తాత ఎక్కడినుండో కొంత మందితో బతుకడానికి వచ్చి వాగు ఒడ్డున నీళ్ల సవుల తున్నదని అక్కడ తావై ఉన్నారని, అది ఇప్పుడు ఇంత పెద్ద ఊరయిందని చెప్పుకుంటారు. మరో కథ ఏమి టంటే అప్పుడు ఆ ప్రాంతమంతా దట్టమైన అడవితో ఉండేదిదని ఒక ముని ఆశ్రమం కూడా అక్కడ ఉండే దని ఎవుసం చేసుకోవడానికి అడివిని నరికి చదును చేస్తుంటే ముని అడ్డుపడి అందరినీ అక్కడి నుండి వెళ్లి పొమ్మని శాసించిండని, 'ముక్కు మూసుకుని గమ్మున తపసు చేసుకునేటోళ్లు మీరే ఎక్కడికన్నా వెళ్లండి సామీ, కాయకష్టం చేసుకునేటోళ్లం మాకు నీటి సవులతు ఉండాలని,' ఎదురు తిరిగిండని చెప్పుకుంటారు. అతడి పేరు కూడా రాంరెడ్డేనట. మునికి కోపం వచ్చి, 'నీ వంశం హెచ్చదు,' అని శాపం బెట్టిండట. నా వంశం హెచ్చకపోతే మానె. మిగిలినోళ్ల వంశం హెచ్చి ఊరు పెరిగితే చాలునన్నడట రాంరెడ్డి. అది ఎంతవరకు నిజమో తెలువదిగని రాంరెడ్డి కుటుంబంలో ఒక్క సంతానమే కలుగుతుంది.

రాంరెడ్డి తండ్రి ఒక్కడే కొడుకు. రాంరెడ్డి కూడా తండ్రికి ఒక్కడే కొడుకు. అతనికి బాపురెడ్డి ఒక్కడే. బాపురెడ్డికి ఇప్పుడు ఒక్కడే కొడుకు. పేరు తాత పేరే... రాంరెడ్డి ! తరం మారినప్పుడల్లా కొడుక్కి తండ్రి పేరు ఆనవాయితీగా పెట్టుకుంటున్నారు.

రాంరెడ్డి తాత హయాంలో ఊరికి రెండు చెరువులు తవ్వించాడు. వాగులోంచి ఊరి తలాపుకు రెండు కాలువల్ని తవ్వించి చెరువులో కలిపాడు. ఆయ కట్టు పెరిగింది. అడవి పంట పొలంగా మారింది. రాం రెడ్డి తండ్రి బాపురెడ్డి ఊరికి మట్టిరోడ్లు వేయించాడు. తొవ్వలు విడిచి ఒక పద్ధతి ప్రకారం కొత్త వాడలకు ముగ్గు పోయించాడు. పంట కాలువలు తవ్వించాడు. చెరువులకు తూములు పెట్టించాడు. ఊరుచుట్టూ చింతా మామిడిచెట్లు పెట్టించాడు. మంచినీటి కొరకు బాయిలు తవ్వించాడు.

రాంరెడ్డి హయాం వచ్చేసరికి ఊరు పెద్దద యింది. జనాభా పెరిగింది. చుట్టుమెట్టు ఊర్లల్ల ఎక్కడాలేని ఎవరూ ఎన్నుకోని కమిటీ ఒకటి రాంరెడ్డి పల్లెలో ఉన్నది. అది గ్రామాభివృద్ధి కమిటి. మొదట ఆ ఊరికి వచ్చిన కుటుంబాలలోని వ్యక్తులే అందులో సభ్యులు. ఆ కమిటీ నిర్ణయాలకు తిరుగులేదన్న వాస్తవం తండ్రి హయాందాకా కొనసాగింది. తాతల తండ్రుల ఆలోచనల్ని అమలు చేస్తున్నట్టే రాంరెడ్డి ఎప్పుడూ ఊరి గురించే ఆలోచిస్తడు. చానొద్దులు సర్పంచ్‌గిరి చేసిండు. అధికారం చేతవట్టినంక ఊరికి 'కళ' వచ్చిందన్నరు అందరు. ఎప్పుడు ఎంతుండేదో తెలవదిగని తండ్రి చేతికచ్చిన ఇరువై ఎకరాల భూమి పదెకురాలై రాంరెడ్డి కచ్చింది. అదిప్పుడు ఆరతి కర్పూరం లెక్క కరిగి ఐదెకురాలయింది. 'ధర్మరాజులు, అమ్మిన పైసంతా ఊరికే పెట్టిండ్రని,' ఎనుకటి పెద్ద మనుషులు అప్పుడప్పుడూ యాదిజేస్తరు.

పంచాయతీ చట్టం వచ్చి పదవి పోయినా కమిటీ ప్రెసిడెంట్‌గా చేయాల్సిన పనులు చేసినాక మొదటి సారిగా ఎదురుదెబ్బ ఏడాది కిందటనే పడింది. అప్పుడు విలవిలలాడినా ఆ డబ్బు వారి మొహాన కొట్టాడు. ఎండా కాలంలో లేని సమస్య అది. వానలు పడగానే మొదలయింది. చెరువుల చేపల్ని ఎప్పుడూ గుత్తకు పట్టుకునేటోళ్లు. నీళ్లు ఎండిపోయినంక చేపల్ని పట్టి లారీలకు పోసేటోళ్లు. వానకాలం వచ్చి కొత్తనీళ్లు చెరువుల పడుడుతోనే చాపలు ఎదురెక్కుతయి. వాగు పొంటి మడుగులల్ల ఉన్న చేపలు గూడా కాలువ పొంటి చెరువులకత్తయి. మత్తడి దుంకే జాగల చేపలు ఎగిరెగిరి పడుతయి. చుట్టు మెట్టు చేన్లున్నోళ్లు గాలా లతో, తోపెల వలతో, బట్టలతో కాలువ పొంటి పట్టు కునేటోళ్లు. చెరువులకు దిగేవాళ్లు కాదు. అందుకని చెరువును గుత్తకు పట్టుకున్నోళ్లు ఏమీ అనలేకపోయేది.

చెరువుల చాప ఇత్తునం తక్కువైతొందని భయ పడి ఒక నిర్ణయానికి వచ్చాక వాళ్లు కమిటీ ముందుకు వచ్చారు. ''ఊరు మీదికి ఐదు వెయిలిత్తం. కాలువ పొంటి, వాగు పొంటి ఎవలూ చాపలు పట్టకుండ కట్టడి చెయ్యింండ్రి,'' అన్నరు. 'అయిదువెయిలు బడికి ఇస్తే సరి,' అనుకొని అందరూ సరేనన్నరు. రాంరెడ్డి మాత్రం ఒప్పుకోలేదు. ''రోనీ ముర్గశిర కార్తులల్ల తమ్మీ! వాలా యించి చాపలు తినాలె. ఐదు వెయిలకు ఆశపడి ఊరిది నోటిబుక్క ఎత్తగొట్టుడెందుకు? వాగు, కాలువలు అందరియి. అందరు తినచ్చు,'' అన్నప్పుడు వాదం జరిగింది. కొందరు ఔనన్నరు. కొందరు కాద న్నరు. చెరువుల పడుతున్నమా? కాలువ పొంటానాయె నని కొందరు... యాడైతే ఏంది పైసలురాంగా అని కొందరు. లొల్లిలలొల్లి. కొందరు గల్లలు కూడా పట్టు కున్నరు.

ఇక ముదిరితే పెద్ద కొట్లాటయితదని గ్రహించిన రాంరెడ్డి ఆ ఐదు వెయిలేవో నేనే ఇస్త బడికి. ఎప్పటి లెక్కనే నడువని అన్నడు. లొల్లి సద్దుమణిగినా చెరువు లను గుత్తకు పట్టుకున్నోళ్లు గుర్రుగా చూసింండ్రు రాంరెడ్డిని.

చలికాలం వచ్చింది. ఊరు చుట్టూ చిప్పలచెట్లు. ఏటా పదిలారీల కాయల్ని అమ్ముతరు. ఇష్టమున్న వాళ్లు గంపలు సంచులు పట్టుకుని చిప్పలకాయలకు పోతరు. తెంపుకచ్చుకుని ఇండ్లల్ల మక్కేసుకుని తింటరు. పశువుల కాడికిపోయే పిల్లగాండ్లయితే ఆ కాలంలో సద్దులు కొండవోరు. కంటికి నజరైన కాయను తెంపి కాల్చుకుంటరు.

అడవి తగ్గి ఒకటిరెండుసార్లు కాత లేకపోవడంతో చెట్లను గుత్తకు పట్టుకున్నవాళ్లు గ్రామ కమిటీ ముందు కొచ్చారు. లంచమిచ్చి సభ్యులను కట్టుకున్నారు. ఊరి మీదికి ఎంతోకొంత డబ్బు ఇస్తామని ఊరిలోకి ఒక్క కాయ రాకుండా ఎవరూ తెంపకుండా కట్టడి చేయాలని ఒత్తిడి తెచ్చారు. అందరూ సరేనన్నారు. రాంరెడ్డి మాత్రం ఖచ్చితంగా నిలబడ్డాడు.

''డబ్బుకు ఆశపడి ఊరిని కాయాపండుకు దూరం జేస్తరా... ఉన్నోడుంటడు. లేనోడుంటడు. పైసలు పెట్టి కొనుక్కుంటరా అందరు. ఊరు తినంగ మిగిలినయే మీరు అమ్ముకోంండ్రి. ఒక్కవేళ మీరు అట్ల కట్టడి జేసింండ్రనుకో దొంగతనంగనైనా తెంపుకస్తరు జనం. వాటమైనోడు దొరుకడు. వాటంగానోడు ఎప్పుడన్న దొరికితే దండుగు జరుమానపాలు జేస్తరు. ఇదేమన్న న్యాయమా?'' అన్నాడు నిలదీస్తూ.

కొందరు సరేనన్నారు, కొందరు కాదన్నారు. ఆ జంగల్ ఎట్లుంటదో మాకు ఎరుకనే లేదు. ఎప్పుడైనా పైసలు పెట్టి కొనుడే! కట్టడి జేయింండ్రి అన్నరు కొందరు. కొందరు తప్పకుండా తెచ్చుకుంటం పండంటే అందరికీ పలారమే అన్నరు. ఎనుకా ముందు తొక్కు కున్నాక లంచాలు తిన్న పెద్ద మనుషులు ఎనుక తొక్కు తొక్కింండ్రు. అప్పటితో ఆ సమస్య మాసిపోయినా రాంరెడ్డి కమిటీ సభ్యులు కంటయిండు.

ఎండాకాలం వచ్చింది. ఊరికిందే వాగు. అంతకుముందు ఎవరికన్నూ పడలేదు కానీ మట్టితో కాజ్‌వేని నిర్మించినాక కనుచూపు మేరలో బల్లపరుపుగా పరిచిన ఇసుక మీద కాంట్రాక్టర్ల కన్ను పడింది.

*

పొద్దు కరకర పొడిచింది. వేలంపాట పాడి ఇసుకను పట్టుకోవాలనుకునేవారు ఉత్సాహంగా చేరు కుంటున్నారు. పాట ఎవరైనా పెంచవచ్చుననడంతో పక్క ఊరి నుండి కూడా వస్తున్నారు. ఊరిలో కాంట్రాక్టరు పాట ఇరువై వేయిలని మూడు రోజుల కిందటే ప్రకటించాడు. రాంరెడ్డి ఎదురు తిరగడంతో వాయిదా పడింది. ఆ విషయం మూడురోజులు నానీ నానీ ఒక నిర్ణయానికి వచ్చినంక ఈరోజు చాటింపు వేయించారు.

ఇంకా పాట మొదలుకాలేదు. సభ్యులు ఒక్కొ క్కరే జమగూడుతున్నారు. అప్పుడే అక్కడికి వచ్చాడు రాంరెడ్డి. కొందరు 'బాపు' అంటున్నారు. మరికొందరు 'పటేలా' అంటున్నారు. నమస్తే పెడుతూ పలకరి స్తున్నారు. ఎవరినీ పట్టించుకోకుండా కచేరులోకి వెళ్లాడు రాంరెడ్డి. వెంట నర్సింలు కూడా ఉన్నాడు.

అక్కడ ముగ్గురు సభ్యులు ఏదో చర్చిస్తున్నారు. వారి చుట్టూ నలుగురైదుగురు గుమిగూడి ఉన్నారు. కొంతమంది కులపెద్దలు కూడా ఉన్నారు. చేతికర్రను ఎత్తి పొడిచి నిటారుగా నిలబడి గర్జించాడు రాంరెడ్డి. ''ఒరేయ్... ఇయ్యల్ల మీరు మొనగాల్లయినార్రా... మీరు పుట్టకముందే ఈ ఊరితో నా పేగు ముడిపడ్డదిరా... ఎవడ్రా నన్ను కమిటీకి దూరంచేసింది... చేస్తే చేసిం డ్రురా... చేసి మీరు మాత్రం చేస్తున్నదేంట్రా... ఊరును సత్తెనాశినం జేత్తరురా... తాగుడుకు నీళ్లు లేకుండ జేస్తరు.''

అందరూ అతడివైపు తేరిపార జూసారు. ముందు గా తేరుకున్న వెంకటి అన్నాడు నెమ్మదిగా...

''ఏంటిది బాపూ... ఇందులో మేము ఏదో తింటు న్నట్టు మాట్లాడుతరు. ఎన్ని డబ్బులిస్తే అన్ని డబ్బులు

నీ చేతులనే పెడుతం. నువ్వే పనులు చేయించు. మా ఇండ్లకు వచ్చినట్టు మాట్లాడుతున్నవు. మేము తండ్లా డేడిది ఊరి బాగు గురించే కదా... ఈ డబ్బుతో మంచి నీటి సౌలతు జెయ్యాలనుకుంటున్నం...''

అతడి మాటలు పూర్తి కానేలేదు. అందుకున్నాడు రాంరెడ్డి. "మీరు ఊరు బాగు గురించి కాదురా... నాశిన గాల్లం గురించి చేస్తండ్రు. వాగులో ఏలు ఎట్టినంక ఏమైతదో మీకు తెలుసునారా? ఊరిమయాద అంత యావ ఉంటే మనిషికిన్ని పైసలేసుకుని మంచినీటి సవులతు చేసుకుందాం. ఉశికెతోడితే వాగులోతులో పడి రెండు చెరువుల కాలువలు ఎత్తిపోతయిరా... చెరువులకు ఒక్క బొట్టు నీళ్లు రాక నోట్లె మన్ను వడుతది. వాగుగట్టు కోసుకపొయ్యి గడ్డపొంటి అడివిల ఒక్క చెట్టుండుదిరా... అభిరుద్ధి పేరుతో ఊరికి విషం బెడుతున్నరురా...'' ఆవేశంగా కర్రను నేలకు పొడుస్తూ అన్నాడు. తలలో తిరిగినట్టయి, కళ్లల్లో నీళ్లు కమ్మి నయి... నిలదొక్కుకోబోతూ సొలిగి నర్సయ్య భుజాన్ని ఆసరాగా పట్టుకున్నాడు.

అర్థంకాని వాళ్లు అతడివైపు వెర్రిగా చూసి నవ్వుతున్నారు. అయినవాళ్లు తేలుకుట్టిన దొంగల్లా తప్పుకుంటున్నారు. ఎప్పుడో ఏదో జరుగుతదని ఇప్పటి నుండే భయపడుతమా అని కొందరు అనుకుంటు న్నారు. మొత్తం మీద అందరూ మౌనంగా ఉన్నారు. వెంకటి మాత్రం ఆవేశంగా లేచాడు.

''ఏంది... అదేమన్న ఇసుక తెప్పనా, కుప్పనా... ఎంత ఔరగొట్టినా దరగది తెలుసా...?'' తల బిరుసుగా అన్నాడు.

నీళ్లు నిండిన కళ్లలో వెంకటి రూపం వికృతంగా కనిపించింది. కండ్లు నులుముకుని చూశాడు. చూపు ఆనడం లేదు. కోపం మాత్రం రెండింతలయింది.

''ఓరి పిచ్చోడా... ఇరువై వెయిలు పెట్టినోడు వట్టిగా ఊకుంటాడురా! పొద్దున మాపున టాక్టర్ల మీద జారగొడుతడు. పట్నం కెల్లి ఆర్డర్లు తెచ్చుకుంటడు. అందినంతా సంపాయించుకునేందుకు గంగరాళ్లు తేలే టట్టు సాపు జేస్తడు. వాగునంతా కడిగేస్తరురా... ఇప్పటికే ఎవలేం పుణ్యం జేసి మలుపుకున్నరో... ఏడాదికి మున్నూట అరువై రోజులు మోకాలు మంచినీళ్లతో పారే వాగుల వానకాలం నెలా రెండు నెలలు తప్ప నీటి చుక్క కనవడుతలేదు,'' అన్నాడు.

ఇంతవరకూ మౌనంగా కూచున్న సర్పంచ్ పెదవి విప్పాడు.

''బాపూ... ఇది మా ఒక్కల ముచ్చటగాదు. ఊరందరి ముచ్చట. అందరిని అడిగినంకనే ఈ నిర్ణయం కచ్చినం. ఇప్పటికీ నేను జెపుతున్న. ఊర్లె ఒక్క డంటే ఒక్కడు ఎవలన్నా ఒక్క మనిషితోని ఈ వేలం వద్దనిపియ్యి. దీన్ని రద్దు జెయ్యకపోతే నన్నడుగు,'' నెమ్మదిగా అన్నాడు. అతడి మాటలు సవాల్ విసిరినట్టు గా కాకుండా ధీమాగా అందరి ఆమోదం ఉందని చెబు తున్నట్టుగా ఉన్నాయి.

''ఒక్కల్ని గాదురా... వందమందితోని అనిపిస్త. ఎవరో ఎందుకు? నర్సింలు తోనే అనిపిస్త... నీకు భయంలేదు. చెప్పురా నర్సింలు. ఆగుల ఏలు పెట్టద్దని చెప్పు,'' ఆసరా పట్టుకున్న భుజంను తడుతూ నర్సయ్య వైపు తిరిగి అన్నాడు రాంరెడ్డి. వాగులోని కరెంటు మోటార్లు గుర్తొచ్చాయి.

నర్సయ్య అతడి నుండి రెండడుగుల దూరం జరిగి బేలగా మొహం పెడుతూ, ''అది బంగారమా భాగ్యమా? వాగుల ఉసికె. సల్లే చెలిమను సల్లితే ఊరే చెలిమ ఊరుతది. ఎంత ఉసికెను తీత్తే అంత ఉసిక కూడుతనే ఉంటది,'' అన్నాడు అద్దాలు సవరించు కుంటూ.

ఒక్కక్షణం బిత్తరపోయినట్టు చూశాడు రాంరెడ్డి. వెంటనే తేరుకుని, ''థూ... నీయవ్వ... పాలు తాగిన రొమ్మును కొరికేటోళ్లురా మీరు...'' అంటూ దవడ బిగబట్టి చుట్టూ చూశాడు. అందరి చూపుల్లోను హేళన కనిపించింది. ఇక అక్కడ నిలబడలేక చీత్కారంగా చూస్తూ... ''ఒరేయ్ మీరు అదే మాట మీద దమ్ముంటే నిలువుండ్రిరా... వందమందితో కాదనిపిస్తా,'' అంటూ రెండడుగులు ముందుకు వేశాడు.

బయట గుమిగూడిన మందిని పావుకుంటూ బాపురెడ్డి రావడం గమనించాడు రాంరెడ్డి. పోయిన పాణం లేచి వచ్చినట్టయింది. ఎంతైనా వీడు నా కొడుకు. నా రక్తం పంచుకుని పుట్టినోడు. బతిమిలాడి అయినా ఒప్పిస్తాననుకుని ముందుకు నడిచాడు. అప్పటికే బాపురెడ్డి మందిని దాటుకుని ముందుకు వచ్చాడు.

''అరే బాపూ... మన తాతల తండ్రులు ఊరంటే పాణం అడ్డు పెట్టిండ్రురా... తన వంశం ఎచ్చుకున్నా సరే! ఊరు ఎచ్చాలెనని మన ముత్తాత ముని శాపాన్ని ఎదురు నిలువడ్డడురా... ఆ వంశంల పుట్టిన మనం నీతిని మరువద్దు. నా మొఖం చూసైనా చెప్పురా... ఈ పాటను ఆపుమని,'' కొడుకు భుజంపై చేయివేసి దగ్గరికి లాక్కుంటూ అన్నాడు రాంరెడ్డి. అతడి గొంతు వణుకు తుంది.

అందరూ ఊపిరి బిగపట్టుకుని తండ్రి కొడుకులను చూస్తున్నారు.

రాంరెడ్డి మాత్రం కొడుకునే చూస్తున్నాడు. అతడి మొఖంలో ముడిపడ్డ పేగు విడిపోయినప్పుడు కలిగే ఆందోళనల్ని ఆరాటంగా వెదుకుతున్నాడు. ఆందోళనగా కొడుకును తడుముతున్నాడు.

"నాయినా... నీ పాణం బాగలేదు. ముందుగల్ల దవాఖాన్లకు పోదాం పా. వచ్చినంక అన్నీ మాట్లాడుకుందాం," బతిమాలుతున్నట్టుగా గొంతును తగ్గించి అన్నాడు బాపురెడ్డి.

"ఇక బతికి మాత్రం చేసేదేందిరా... ఈ సంగతి ఇప్పుడే తేలిపోవాలె. రేపు బతుక పుట్టినోనికి సల్లని నీడ లేకుండజేసే ఈ పనిని ఆపిన్నంటే నేను ఇప్పుడు సచ్చినా సంతోషమే!" కొడుకు భుజాన్ని పిడికిళ్లతో బిగబట్టి కుదుపుతూ అన్నాడు.

"నాయినా... నాకు తెల్వదానే! ఊరి గాలిలో మన ఊపిరుంది. ఈ మట్టిలో మన తాతల చెత్త ఉంది. ఎవలతోని మనకేం కొట్లాట అని ఊకుంటున్నగని వాగును అమ్ముకుంటుండ్రంటే తినే కూట్లే మన్ను పోసుకుంటుండ్రని నాకు మాత్రం తెల్లవదానే! ఒక్కసారిగాదు వందలసార్లు... మా తాతముత్తాతల గొంతులతో నేనే జెప్పుత! ఈ వేలం పాడద్దు. తినే తిండిల ఇసం పోసుకోవద్దు," తండ్రిని దగ్గరగా తీసుకుంటూ ఆవేశంగా... అందరికీ వినిపించేలా అన్నాడు.

రాంరెడ్డి కళ్లు చెమర్చాయి. అందరివైపు గర్వంగా తలెత్తుకుని చాతీని పొంగించి చూసి వెంకటి చేతిలోని కాగితాల్ని గుంజకుని రెండుగ చింపి నేలకు విసిరికొట్టి అన్నాడు.

"ఒక అయ్యకు పుట్టినోళ్లయితే మాటమీద నిలవడుండ్రి. కాదు కూడదంటే మూతిమీద మీసాలుండయి."

కొడుకును ఆసరా పట్టుకుని వెనక్కి తిరిగాడు రాంరెడ్డి. కచీరు తంతెలను పదిలంగా దించుతూ అన్నాడు బాపురెడ్డి.

"నాయినా... ఇంటికి పోదామో! దవఖాన దాక నేనూ వస్త. పుర్రెల తిరుగుతుందంటివి గదా!" అన్నాడు బాపురెడ్డి.

"ఇక్కడ చక్రం తిప్పుతరురా! ఎక్కడోళ్లు అక్కడ పోయినంక పోదాం," అంటూ వెనక్కి తిరిగి చూశాడు రాంరెడ్డి.

వెనుక ఏవో నవ్వులు, సైగలు. బాపురెడ్డి కూడా నవ్వుతున్నాడు. కళ్లతోనే సైగ చేస్తూ బరువాసా ఇస్తున్నాడు. ఒక్కసారిగా రాంరెడ్డి కళ్లల్లో నిప్పులు కురిసాయి. కొడుకు చేతుల్ని విడిపించుకుని తపుక్కున కూలవడ్డాడు.

"ఒరేయ్... మీరు మనుసులు గాదురా! తెలువనోళ్లు సరే! తెలిసినోళ్లు మీరెందుకు మూతులు కట్టేసుకున్నారురా! ఒక్కడు... ఒక్కడంటే ఒక్కడు లేడారా ఇది పద్ధతికాదని చెప్పడుకు. తెలిసినోడు నోరు మూసుకుంటే అంతకంటే పాపం ఇంకొకటి లేదురా! గోజ, గొడ్డు, పచ్చి... కోటొక్క జీవరాసుల గోస మీకు తలుగుతదిరా!" అరుస్తున్నట్టుగా అన్నాడు.

"ముసలోడు గట్లనే ఒర్రుతడు మీ పని కానీ..." ఎవరో అన్నారు. చూస్తుండగానే వేలంపాట మొదలయింది. కడుపుల పేగులు కదిలినంత బాధ వేసింది రాంరెడ్డికి.

తన ఎత్తును గమనించాడని తెలిశాక తండ్రిని మాట్లాడియ్యాలంటే భయమేసింది బాపురెడ్డికి. మౌనంగా పక్కనే నిలబడి వేలంపాటను చూస్తున్నాడు.

పరిస్థితి అర్థమయింది రాంరెడ్డికి. దిగ్గునలేచి నిలబడ్డాడు. భుజం మీదున్న తువ్వాలను సదురుకుంటూ అంగి జేబును తడిమి చూసుకున్నాడు. దవాఖానకు పోవాలని చేపోయి అడుక్కున్న నోట్లు తగిలాయి. గబగబా తంతెలు దిగి వేలం దగ్గరికి వచ్చి నిలబడి అన్నాడు.

"మిమ్మల్ని దయ్యాలు పట్టినయి. మీరు మనుషులు గాదు. మనిషి రూపంలో ఉన్న భూతాలు. నా బొందిల పానముండగ ఎవడూ వాగులకు అడుగు పెట్టలేడు. నాకూ కానూన్లు తెలుసు. పొద్దుగూకే వరకు కోర్టు నోటీసు తేకపోతే నన్ను రాంరెడ్డి కాదనుండ్రి... ఎవడో ఇసిరిన ఎంగిలి మెతుకులకు ఆశపడి నీడనిచ్చే చెట్టును నరుక్కుంటార్రా," వడివడిగా ముందుకు నడిచాడు రాంరెడ్డి.

తండ్రిని ఆపాలని చేయి అందుకున్నాడు బాపురెడ్డి. ఇసిరికొట్టి వెనక్కి తిరిగి చూపుడు వేలితోనే ఆగమని సైగ చేసి రోషంగా ముందుకు కదిలాడు రాంరెడ్డి.

ఇది నేరమో కాదో ఏ చట్టమో ఏ సెక్షనో... కోర్టులో కేసువేసి ఆపవచ్చో లేదో ఏ విషయం తెలియదు రాంరెడ్డికి. ఊరిపై ఉన్న మమకారం అంతులేని ఆత్మవిశ్వాసం అతడిని ముందుకు నడిపిస్తున్నది.

వేలం పాట మాత్రం సాగుతూనే ఉంది.

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, నవంబరు 2001*

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో ఈ కథ కె. దేవయాని పేరుతోనే అచ్చయింది.*
*తరువాతి కాలంలో ఇది పెద్దింటి అశోక్‌కుమార్ కథ అని తెలిసింది.*